సాక్షి
మెదక్
బుధవారం | 14 | జూన్ | 2023



మైనర్ తప్పు.. మేజర్ ముప్పు
తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్లు ఇస్తున్నారు. తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారు. 8లో



మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్ హత్య 8లో
బాకీ డబ్బుల విషయమై మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్(35)ను ముగ్గురు యువకులు హత్యచేశారని డీఎస్పీ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 88మంది గైర్హాజరు
మెదక్ కలెక్టరేట్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షలకు 88 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం ఫస్ట్ ఇయర్ ఎగ్జామ్స్ జరగ్గా, 488 మందికి 17మంది, మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలకు 1127మంది హాజరు కావాల్సి ఉండగా, 71మంది గైర్హాజరయ్యారు.

న్యూస్‌రీల్

రైతులు పంట మార్పిడి చేయాలి



గుజిరితండా రైతులతో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటమార్పిడి దిశగా ఆలోచన చేయాలని కేవీకే తునికి శాస్త్రవేత్త రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గుజిరితండాలో చర్చాగోష్ఠి నిర్వహించి పలుఅంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు పురుగుమందులు తగ్గించే ప్రయత్నం చేయాలని, తరచు పంటమార్పిడి చేయడంవల్ల నేల సారవంతమవుతుందన్నారు. రైతులు తమకు ఉన్న పొలంలో కొంతమేరకైనా సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాకేశ్‌నాయక్, ఉపసర్పంచ్ భిక్ష్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య దినోత్సవం

మెదక్‌కలెక్టరేట్: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌కు సంబంధించి మాయగార్డెన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు, నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్స్‌లో ఉదయం పది గంటలకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యరంగంలో సాధించిన ప్రగతితోపాటు కంటి వెలుగు, పల్లె, బస్తీ దవాఖానాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు తదితర కార్యక్రమాలపై వివరిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారన్నారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ అందించే కార్యక్రమానికి ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్‌నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లను సన్మానిస్తామన్నారు.


కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యల పరిష్కారం



ముట్రాజ్‌పల్లిలో కాంగ్రెస్‌జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని టీపీసీసీ ప్రధాన కార్యాదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని ముట్రాజ్‌పల్లి, రాజిపేట, వెంకటాపూర్(ఆర్) గ్రామాల్లో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీపీసీసీ డెలిగేట్స్ రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అవినీతి,అక్రమాలకు పాల్పడుతుందన్నారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోని రాగానే కుటుంబంలో ఇద్దరు వృద్ధులకు కనీస పెన్షన్ రూ 5వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకులు సయ్యద్ పాష, సహాబ్ పాష, ప్రవీణ్‌రెడ్డి, లింగం, నర్సింలు, పూల్‌సింగ్, సత్యనారాయణ, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, శ్రీనివాస్‌గౌడ్, వీరాగౌడ్, ప్రభు, బాల్‌సింగ్, బద్దు, అరవింద్, పర్వతాలు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 19 సీట్లు, ఇంటర్, డిగ్రీ ఆపై స్థాయి విద్యార్థులకు 4సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు వెంట కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జతపర్చాలన్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు పత్రాలను ఈ నెల 30 లోగా కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

మెనూ మారే...

గురుకులాలు, కస్తూర్బా తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం

సోమవారం :	కిచిడీ, గుడ్డు, మిక్స్‌డ్ వెజిటబుల్‌కర్రీ
మంగళవారం :	అన్నం, సాంబారు, మిక్స్‌డ్ వెజిటబుల్‌కర్రీ
బుధవారం :	అన్నం, ఆకుకూరపప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్‌కర్రీ, గుడ్డు
గురువారం :	వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్‌కర్రీ
శుక్రవారం :	అన్నం, సాంబారు, మిక్స్‌డ్ వెజిటబుల్‌కర్రీ, గుడ్డు
శనివారం :	అన్నం ఆకుకూరపప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ

గతేడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మెనూలో పలు మార్పులు చేశారు. ఇక నుంచి ప్రతిరోజు పోషకాలతో కూడిన ఆహారం, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ అందించనున్నారు. 92వేల మంది విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందనుంది.



మధ్యాహ్నాభోజనం కోసంక్యూలో విద్యార్థులు(ఫైల్)

మెదక్‌జోన్: వెనుకబడిన మెదక్ జిల్లాలో నూటికి 90శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దీంతో అధికశాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు సాగిస్తున్నారు. గత విద్యాసంవత్సరం వరకు అరకొర సౌకర్యాలతోనే ప్రభుత్వ పాఠశాలలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు సాంబారు, అన్నం తప్ప పోషకాహారాన్ని అందించలేకపోయారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపించాయి. ఇలాంటి పరిస్థితులు ఇక ముందు తలెత్తకూడదన్న ఉద్దేశంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఈ విద్యాసంవత్సరం నుంచి మార్పులు చేస్తున్నారు.

- జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజనం వడ్డించే ప్రభుత్వ పాఠశాలలు 897 ఉన్నాయి. వాటిలో సుమారు 92 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- వీటిలో 129 పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వడ్డిస్తున్నారు.
- మిగతా 768 పాఠశాలల్లో వంట కార్మికులు భోజనం తయారు చేసి వడ్డిస్తున్నారు.
- అయితే వంటకార్మికులకు వేతనాలు సరిపోవటం లేదని, బిల్లులు సకాలంలో రావటం లేదని మధ్యాహ్నభోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.
- దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకపై మధ్యాహ్నభోజన నిర్వాహణకు అవసరమైన సామగ్రికి టెండర్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ విధానం ఇప్పటికే గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.
- ప్రస్తుతం విద్యార్థులకు వారానికి మూడుసార్లు గుడ్లు వడ్డిస్తుండగా, బిల్లులు సకాలంలో అందని కారణంగా నిర్వాహకులు ముందుకురాలేదు. దీంతో అక్షయపాత్రకు 129 పాఠశాలలు వెళ్లాయి.

ఉత్తర్వులు అందాయి



మధ్యాహ్నభోజనంలో నూతన మెనూ ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు అందాయి. కొత్తమెనూ అమలు చేయాలంటూ మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం.

– రాధాకిషన్, మెదక్ డీఈఓ



శభాష్‌పల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

15న శభాష్‌పల్లిలో సీఎస్ పర్యటన

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

శివ్వంపేట(నర్సాపూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవంలో సీఎస్ శాంతకుమారి పాల్గొననున్నారు. మండల పరిధి శభాష్‌పల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఆ గ్రామంలో చేయాల్సిన ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. ఈ నెల 15న పల్లె ప్రగతి దినోత్సవంలో సీఎస్ పాల్గొంటున్న నేపథ్యంలో గ్రామ పరిసరాలను పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. గ్రామ శివారులో నుంచి సీఎస్‌కు బోనాలు, తెలంగాణ సాంప్రదాయాలతో స్వాగతం పలికేందుకు అధికారులు చేపట్టే అంశాల గురించి వివిధ శాఖల సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో చర్చించారు. డంపుయార్డు, శ్మశాన వాటిక, వన నర్సరీ, పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, జెడ్పీ సీఈఓ శైలేష్, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్, డీపీఓ సాయిబాబా, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ నవీన్‌కుమార్, సర్పంచ్ పార్వతిసత్యం, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



ఇస్లాపూర్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

తూప్రాన్: అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయా కాలనీలు, నర్సరీ, పార్కును పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో హరితహారం ద్వారా మొక్కలు నాటాలని, ఇందుకు కావాల్సిన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నాటిన మొక్కల్లో విరిగిపోయిన చోట మరో మొక్కను నాటాలన్నారు. అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ రమేశ్, సర్పంచ్ సుకన్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వ్యాప్తిలో వర్గల్ ఆదర్శం

- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- కంచి పీఠాధిపతితో కలిసి శంకరమఠం ప్రారంభం



వర్గల్‌లో కంచిమఠం ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు, కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి

వర్గల్(గజ్వేల్): విభిన్న ఆలయాల సముదాయంతో కూడిన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం ఆధ్యాత్మిక వ్యాప్తిలో ఆదర్శంగా నిలుస్తోందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వర్గల్ క్షేత్రంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించిన కంచి కామకోటి శంకరమఠం, వేద విద్యాలయాలను మంగళవారం కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలో మర్పడగ క్షేత్రంలో శంకరమఠం నిర్మించి సనాతనధర్మ వ్యాప్తికి కృషి చేస్తామని, సిద్దిపేటలో కంచి పీఠాధిపతుల శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. వేద విద్య పరిరక్షణతోపాటు, అన్నదానం, ధార్మిక ప్రచారం విజయవంతంగా నిర్వహిస్తున్న చంద్రశేఖర సిద్ధాంతి కృషిని కొనియాడారు. కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ ఆధ్యాత్మిక నాయకత్వంతోపాటు వేద, గోసంరక్షణ, సంస్కృతి పరిరక్షణ జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, మర్పడగ క్షేత్ర వ్యవస్థాపకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ శ్రీప్రసన్నాంజనేయ ఆలయ ఆవరణలో నిర్మించనున్న శ్రీరామ కల్యాణ మండపం నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు నెలల్లో మండపం పనులు పూర్తవుతాయన్నారు. జిల్లా కేంద్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని టీటీడీ బోర్డు చైర్మన్‌ని కోరామని, త్వరలోనే కోమటి చెరువు వద్ద 6 ఎకరాల్లో రూ.25 కోట్లతో దీనిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 1000 పడకల ఆస్పత్రిని నిర్మించి, గుండె, కేన్సర్ సంబంధ వైద్య సేవలను ఉచితంగా అందించబోతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు రమణాచార్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, సూడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, పూజల వెంకటేశ్వరరావు, శేషు కుమార్, పెసరు రాజు, బుస శ్రీనివాస్, సత్యనారాయణ, శోభారఘురాం, సద్ది నాగరాజు రెడ్డి, సాయన్న గారి సుందర్, మడూరి కిట్టు, లిఖిత్, బాల్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేతలు

గజ్వేల్‌రూరల్: మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణం మహతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని, ఆడబిడ్డ పెళ్లికి కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు అందిస్తూ అండగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్యంతో పాటు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నారన్నారు. అంతకుముందు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాడితో ఆర్థికాభివృద్ధి

గూడూరులో మేలుజాతి దూడల ప్రదర్శన



ఆవులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పాడిపరిశ్రమ ద్వారా రైతులు ఆర్థిభివృద్ధి సాధించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గూడూరులో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధిసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మేలుజాతి దూడల ప్రదర్శన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిని అభివృద్ధి చేసేందుకు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృత్రిమ గర్భధారణ వల్ల పశుసంపద పెరిగిందన్నారు. మేలుజాతి పాడి గేదెలు, ఆవుల వల్ల రైతుల ఆదాయం రెట్టింపు ఉంటుందన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ లక్ష్మారెడ్డి, జేడీ విజయ్ శేఖర్‌రెడ్డి, ఏడీ వెంకటయ్య మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ సేవలు ప్రతి రైతుకు అందుబాటులోకి తీసుకురావడానికి గోపాలమిత్రలు పనిచేస్తున్నారని, వారిసేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సూపర్‌వైజర్లు సత్యనారయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలకు కేసీఆర్ పెద్దపీట

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర మహిళాకమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా తదితరులు

నర్సాపూర్: మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలను నిజం చేసేందుకు, సీఎం కేసీఆర్ మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ధవారం సాయికృష్ణ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దశాబ్ది సంబరాల్లో భాగంగా మహిళా సంక్షేమదినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పసికందు నుంచి పండుముసలి వరకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. నీతి అయోగ్ సంస్థ సీఎం కేసీఆ మహిళల కోసం అమలు చేస్తున్న పలు పథకాలను ప్రశంసిందన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను సీఎం కేసీఆర్ గౌరవిస్తూ వారి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల కోసం సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, సంగారెడ్డి జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న, మహిళా ప్రజాప్రతినిధులు ఎంపీపీలు, జెడ్పీటీసీలు జ్యోతి, కవిత, మంజుల, మేఘమాల, వినోత, స్వరూప, సీడీపీఓ హేమభార్గవి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. పలు పాఠశాలలకు చెందిన చిన్నారులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయగా, వారిలో కొందరికి మెమొంటోలు అందచేశారు. పలువురు మహిళా ఉద్యోగులను కూడా సన్మానించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ మున్సిపాలిటీ: అప్పుడే పుట్టిన శిశువు నుంచి వృద్ధాప్యంలో ఉన్నవారికి వరకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు, ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయిబాలాజీ గార్డెన్‌లో మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సంక్షేమదినోత్సవాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లా మహిళాశిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ మెదక్ నియోజకవర్గ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు గుక్కెడు మంచినీళ్ల కోసం మహిళలు బిందెలు పట్టుకొని కిలోమీటర్ల దూరం వెళ్లేవారని, కానీ నేడు ఇంటింటికి కుళాయి నీరు అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి నిలబెట్టారన్నారు. భవిష్యత్‌తరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడానికి బుధవారం నుంచి కేసీఆర్ న్యూట్రీషన్ కిట్‌లు అందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడూతూ మహిళలలో వృత్తి నైపుణ్యత పెంచి ఆర్థికంగా బలోపేతం కావడానికి సెర్ప్, పితర శాఖల ద్వారా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. వివిధ శాఖలలో ఉత్తమ మహిళా ఉద్యోగినులను జ్ఞాపిక, ప్రశంసపత్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, ఎంపీపీ యమునారెడ్డి, మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర, మత్స్యశాఖ ఏడీ రజిని, డీసీఓ కరుణ, అదనపు పీడీ భీమయ్య, మైనారిటీ అధికారి జెంలానాయక్, బీసీ అభివృద్ధి అధికారి శంకర్, రామాయంపేట మునిసిపల్ కమిషనర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీఈఓ

రామాయంపేట (మెదక్): పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని రామాయంపేట, అక్కన్నపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీలో చదువుకొని ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలన్నారు. స్కూలులో చేరిన చిన్నారులకు యూనిఫామ్‌తో పాటు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంతకు ముందు డీఈఓ మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు పంపిణీ చేయడానికి పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాంలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి నీలకంఠం , ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

అక్రమ మట్టిరవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకున్నారు. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామం మీదుగా అక్రమ మట్టి రవాణాను ఓ పరిశ్రమకు తరలిస్తున్నారనే విషయం తెలుసుకొని కొంత మంది గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో సంఘటన స్థలానికి వీఆర్‌ఏను పంపించారు. వారు వచ్చి అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవడంతో వీఆర్‌ఏకు మట్టిని తరలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో టెంట్‌హౌస్ శ్రీనివాస్, హరీష్‌గౌడ్‌లు కోనాయపల్లి(పీటీ) వీఆర్‌ఏ నరేష్‌ను దుర్భాషలాడి అతని విధులకు ఆంటంకం కలిగించారు. దీంతో వీఆర్‌ఏ నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ కాశీనాథ్

జహీరాబాద్ టౌన్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన సిరిగిరి జర్నప్ప బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. సీఈఐఆర్‌తో మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మీ సేవా లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో రైటర్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణానికి చెందిన దండు వంశీ (25) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన రంజిత్ తిరిగి రాలేదని అతని భార్య కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లోన్ పేరిట సైబర్ మోసం

వర్గల్(గజ్వేల్): లోన్ పేరిట ఓ వ్యక్తిని మోసం చేసిన సంఘటన వర్గల్ మండలం గౌరారంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గౌరారం గ్రామానికి చెందిన సిరిపురం వెంకటేష్ ఫోన్‌పేకు రూ.5లక్షల లోన్ వచ్చిందని ఈ నెల 8న సైబర్ నేరగాళ్లు ఒక లింకు పంపించాడు. దాన్ని నమ్మిన వెంకటేష్ ఆ లింకును ఓపెన్ చేసి అందులో తన వ్యక్తిగత వివరాలు నమోదుచేశాడు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ మంజూరైందని చెప్పాడు. అందుకు సంబంధించి రూ.9,000 ఇన్సూరెన్స్, ఈఎంఐ పేమెంట్ కలిపి మొత్తం రూ.25,000 పంపించాలని సూచించాడు. లోన్ వస్తుందన్న ఆశతో ఆ మొత్తం పంపించాడు. మళ్లీ టీడీఎస్ కోసం రూ.25,000 పంపించాలని కోరడంతో వెంటనే వెంకటేష్ అనుమానపడ్డాడు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు.

బెజ్జంకి ఎస్‌ఐపై సీపీకి ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ సిద్దిపేట సీపీకి తోటపల్లి సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు మంగళవారం ఫిర్యాదు చేశారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ముగించాలని ఆదేశించడంతో సర్పంచ్‌తో వివాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో మహిళలపై దురుసుగా ప్రవర్తించగా వాగ్వివాదం జరిగినట్లు చెప్పారు. మంత్రి స్వగ్రామం కావడంతో తెలంగాణ వేడుకల్లో వివాదం జరిగినట్లు అపవాదు వస్తుందనే కారణంతో తాను సముదాయించిట్లు సర్పంచ్ చెప్పారు. ఈ విషయంలో ఎస్‌ఐపై విచారణ చేపట్టాలని సీపీకి ఫిర్యాదు చేవారు. ఇటీవల కూడా మరో రెండు సంఘటనల్లో ఫిర్యాదుదారులనే ఎస్‌ఐ వేధించాడని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరారు.

మైనర్ తప్పు.. మేజర్ ముప్పు

- పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు
- ప్రమాదాల్లో ఒకటి మైనర్ డ్రైవింగ్ కేసు
- సైకిల్ నడపాల్సిన వయస్సులో బైక్‌పై స్వారీ
- కఠిన చర్యలు తీసుకుంటామన్న అధికారులు



ఇస్నాపూర్ చౌరస్తా వద్ద మైనర్లను తనిఖీలో పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్లు ఇస్తున్నారు. వాటిని నడుపుతుంటూ అది చూసి సంబరపడుతున్నారు. అయితే కంటికి రెప్పలా పిల్లలను కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి వారిని ప్రమాదాలల్లోకి నెడుతున్నారు. పట్టణ, మండల ప్రాంతాల్లో 4, 5 ప్రమాదాల్లో ఒకటి మైనర్ల డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

➡ ప్రస్తుతం పిల్లలు వాహనాలు నడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు వద్దని చెప్తున్న వారి మాట వినకుండా ద్విచక్ర వాహనాలను తీసుకొని రహదారుల పైకి వస్తున్నారు.

➡ మరికొందరు స్వయంగా తమ పిల్లలకు డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తో పోల్చుకుంటే, పటాన్ చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులను ఎక్కువగా నమోదయ్యాయి.

➡ సైకిల్ నడపాల్సిన వయస్సులో పిల్లలు ద్విచక్ర వాహనాలపై స్కూళ్లకు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాల్లో సరుకులు తేవాలని పంపుతున్నారు. మరికొందరి తమ పిల్లలు వాహనం నడుపుతున్నారని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇలా ఇవ్వడం తప్పని తెలిసే తప్పు చేస్తున్నారు.

జిల్లాలో మైనర్ డ్రైవింగ్ వివరాలు...

- జిల్లాలోని సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 12 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో రూ.6 వేలు జరిమానా విధించారు.
- పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది 313 మైనర్ డ్రైవింగ్ కేసులకు రూ.1,56,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



వాహనాలు నడపాలంటే 18 సంవత్సరాల పైబడి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. గంటకు 25 కిలోమీటర్ కంటే వేగంగా వెళ్లలేని వాహనాలకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ అవసరం లేదు. 26 కిలో మీటర్ల కంటే ఒక్క కిలోమీటర్ వేగంగా వెళ్లినా ఎలక్ట్రిక్ వాహనాలైనా రిజిస్ట్రేషన్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.

– రాజా మహమ్మద్, ఎంవీఐ



సంగారెడ్డి టౌన్‌లో బైక్‌పై వెళ్తున్న మైనర్లు

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



మైనర్లు వాహనాలు నడపరాదు. మొదటిసారి తనిఖీల్లో పట్టుబడితే వారికి జరిమానా విధించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులను పిలిపించి వారికి కూడా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చే వారు ప్రమాదంబారినపడే విధంగా ప్రోత్సహించడం సరికాదు. వాహనం ఇచ్చే ముందు ఒకసారి ఆలోచించాలి.

– ప్రవీణ్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



కోహీర్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండలంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయాధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, విత్తన నిల్వలను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీలర్లను ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు సరఫరా చేయాలని రైతులకు సూచించారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంబంధించి రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని వారు హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి జేడీఏ పుష్పరాణి, ఏడీఏ భిక్షపతి, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఎస్‌ఐ అంబాజి, ఏఈఓలు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద విద్యుదాఘాతంతో గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద విద్యుత్ వైర్ల నుంచి చిన్న పాటి గాలికి మంటలు వస్తుంటాయి. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభంనుంచి నిప్పురవ్వలు వెలువడి ప్రక్కనే ఉన్న గడ్డివాములపై పడ్డాయి. దీంతో గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. అక్కడ మంటలు వ్యాపించే క్రమంలో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. జేసీబీ సహాయంతో గడ్డి కుప్పలను వేరు చేసి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

గోవా మద్యం పట్టివేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలో గోవా మద్యాన్ని పట్టుకున్నారు. ఆబ్కారీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఘట్కేసర్ పరిధిలో మద్యం కేసు విచారణ చేస్తున్న ఆబ్కారీ పోలీసులు సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన హరికృష్ణ గౌడ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వాహనంలో 300 గోవా మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవా టూరిస్ట్ గైడ్‌గా పనిచేసున్న హరికృష్ణ హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో గోవా మద్యం సీసాలను విక్రయానికి పాల్పడుతుండేవాడని పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నట్టు తెలిపారు.

బాయిలర్ వద్ద కార్మికుడికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): బాయిలర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వెలువడడంతో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన గడ్డపోతారం పారిశ్రామిక వాడలో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్ బాందా జిల్లా అర్మార్ గ్రామానికి చెందిన సన్నిదేవ్ బాయిలర్‌వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. బాయిలర్‌ను కడిగి రసాయ నీళ్లను కొందరు పోయడంతో ఒక్కసారిగా మంటలు వెలువడ్డాయి. ఈ ఘటనలో సన్నీదేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 30శాతం గాయాలు అయినట్లు వైద్యులు చెప్పారు. బాయిలర్ ఆపరేటర్ వీరరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ముష్టం అశోక్‌గౌడ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన ముష్టం అశోక్‌గౌడ్ (30) గద్వాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..ఫ్లెక్సీలు కట్టే ఆర్డర్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో విజయవాడలో జరిగే ఓ సమావేశానికి ఫ్లెక్సీ కట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన మరి కొందరు కూలీలతో కలిసి డీసీఎంలో వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గద్వాల చేరుకోగానే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్‌గౌడ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, సర్పంచ్ పుల్లోజు కిరణ్ కుమార్‌చారి మంగళవారం సంఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగోల్ గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి నర్సాపూర్– వెల్దుర్తి, లింగోజిగూడ చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. లింగోజిగూడ తండాకు చెందిన విఠల్ పొలం వద్దకు బైక్‌పై వెళ్లి తండాకు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విఠల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఆదుపు తప్పి..

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్ ఆదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన తిగుల్ గ్రామ శివారులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి శ్రీరామ్ నాగరాజు(32) మంగళవారం రాత్రి బైక్‌పై జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు.

భూతగాదా కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ

జహీరాబాద్: భూతగాదాలో జోక్యం చేసుకుని చంపేస్తానని బెదరించినందుకు గాను నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్ పట్టణంలోని బీదర్ వైపు వెళ్లే రోడ్డు పక్కన రైల్వే గేటు వద్ద గల సర్వే నెం.310/ఎ లో 25ఎకరాల భూమికి సంబంధించి యజమానులైన జైపాల్, అతని కుటుంబ సభ్యులు హైకోర్టులో కేసు వేయగా అది న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంది. 2022 జూన్ 25వ తేదీన జైపాల్ అతని అగ్రిమెంట్ హోల్డర్లు వాజీద్ హక్కాని, అతిక్ హక్కానీలు అట్టి భూమికి ఫెన్సింగ్ వేయుచుండగా జహీరాబాద్ పట్టణంలోని మోమిన్ మహెలాలకు చెందిన సయ్యద్ ఆబిద్ హుస్సేన్ తన సోదరులైన పప్పు, మంజూర్ హుసేన్, అతని అనుచరులైన మున్నాన్, మోసిన్‌లు కలిసి అట్టి భూమిలోకి అక్రమంగా ప్రవేశించారు. ఈ విషయంలో తమను రోడ్డుపైకి పిలిచి భూమి ఇవ్వక పోతే చంపేస్తామని జులూం చేసి బెదిరించారని జైపాల్ ఫిర్యాదు చేశాడు. ప్రధాన నిందితుడు సయ్యద్ ఆబెద్ హుస్సేన్ అలియాస్ అలీభాయ్‌ని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

అమ్మకానికి ఆడ శిశువు

- అడ్డుకున్న బాలల పరిరక్షణ అధికారులు
- చిల్డ్రన్ హోంకు తరలింపు



ఆడ శిశువును అమ్మకానికి పెట్టిన తల్లి



ఆడ శిశువును కొనుగోలు చేసిన దంపతులు

సిద్దిపేటఅర్బన్: పేగు బంధం తెంచుకొని పుట్టి రెండు రోజులు కాకముందే ఆడపిల్లను అమ్మకానికి పెట్టింది ఓ తల్లి. ఘటనకు సంబంధించి బాలల పరిరక్షణ విభాగం అధికారులు రాము, శిశుగృహ మేనేజర్ ఝాన్సీ, సామాజిక కార్యకర్త రాజారాం తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డి మండలం మోతే గ్రామానికి చెందిన గొడుగు మంజులకు నాలుగో సంతానంగా సోమవారం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడ శిశువు జన్మించింది. మంజులకు గతంలో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా మరో ఇద్దరు పుట్టి చనిపోయారు. కాగా మంజుల భర్త సైతం ఆదివారం చనిపోగా అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం పురిటి నొప్పులు రావడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. చేసేదేమి లేక తల్లి బూరుగుపల్లి శివారుకు చేరుకొని ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు గజ్వేల్‌కు చెందిన ఎండీ జామీన్, ముంతాజ్ దంపతులకు రూ. 20 వేలకు అమ్మేసింది. దీన్ని గమనించిన స్థానికులు 1098కు సమాచారం ఇవ్వడంతో బాలల పరిరక్షణ అధికారులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి శిశువును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి బాలసదనంకు తల్లిని, శిశువును తరలించారు. తన భర్త రెండు రోజుల క్రితం చనిపోవడంతో చేతిలో డబ్బులు లేకపోవడం, ఆడపిల్లను పోషించే పరిస్థితి లేక విక్రయించినట్లు తల్లి మంజుల తెలిపింది. బుధవారం శిశువును కొనుగోలు చేసిన వారిని, తల్లిని, శిశువును సీడబ్ల్యూసీ ముందు హాజరు పర్చనున్నట్టు బాలల పరిరక్షణ అధికారులు తెలిపారు.

మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్ హత్య

- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

జహీరాబాద్: బాకీ డబ్బుల విషయమై మధ్యవర్తిగా వచ్చి బెదిరించడం వల్లే మక్సూద్(35)ను ముగ్గురు యువకులు హత్యచేశారని డీఎస్పీ వి రఘు తెలిపారు. మక్సూద్ హత్య కేసులో మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టుచేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం..జహీరాబాద్ పట్టణంలోని నాగుల కట్టవద్ద బంగారు, వెండి ఆభరణాల షాపు యజమాని ఎండి మక్సూద్ సోమవారం హత్యకు గురయ్యాడు. మక్సూద్ వద్ద పని చేస్తున్న అతిక్ రెండు సంవత్సరాల క్రితం జహీరాబాద్ పట్టణానికి చెందిన షౌకత్ వద్ద అప్పుగా డబ్బులు తీసుకున్నాడు. సరైన సమయంలో తిరిగి ఇవ్వక పోవడం వల్ల 4 నెలల క్రితం నవాజ్ మధ్యవర్తిగా వచ్చి డబ్బులు ఇప్పిస్తానని ఒప్పుకున్నాడు. గడువు ముగిసినా అతిక్ డబ్బులు ఇవ్వలేదు. సోమవారం ఉదయం నవాజ్, తాజొద్దీన్‌బాబా, ఫెరోజ్‌లు కలిసి హోతి(కె) గ్రామంలోని అతిక్ ఇంటికి వెళ్లారు. అతణ్ని బెదిరించి వచ్చారు. అతిక్ ఈ విషయాన్ని తన యజమాని మక్సూద్‌తో చెప్పాడు. సాయంత్రం 4గంటల సమయంలో మక్సూద్ నవాజ్‌కు ఫోన్‌చేసి మీరు అతిక్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించాడు. షౌకత్‌తో తాము మాట్లాడుకుంటామని, మీరు అనవసరంగా ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించాడు. ఈ విషయంలో కోపం తెచ్చుకున్న నిందితులు మక్సూద్ అనవసరంగా మా మధ్యలోకి వచ్చి మమ్ములనే బెదిరిస్తున్నాడని, అతడిని ఎలాగైన అంతమొందించాలని పథకం వేసుకున్నారు. పథకం ప్రకారం మక్సూద్‌ను ఈద్గా ముందు గల షకీల్ హోటల్ వద్దకు పిలిపించుకొని దాడి చేశారు. హత్య కేసులో నిందితులు జహీరాబాద్ పట్టణంలోని గడికి చెందిన షానవాజ్(23), ఫరీద్‌నగర్ కాలనీకి చెందిన ఎండి తాజొద్దీన్(22), గడికి చెందిన ఫెరోజ్ పాష(26)లను పట్టణ శివారులోని తవక్కల్ ఫంక్షన్ హాల్ వద్ద పట్టుకుని, వారి వద్ద నుంచి తల్వార్, కమ్మకత్తి, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేష్, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జేసీబీ గుంతలో పడి విద్యార్థి..



గుగులోత్ ఈశ్వర్ (ఫైల్)

నిజాంపేట(మెదక్): జేసీబీ గుంతలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..నగరం గ్రామానికి చెందిన గుగ్‌లోత్ రాజు, నీలలకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు గుగ్‌లోత్ ఈశ్వర్(16) పదోతరగతి పూర్తి చేసుకొని మంగళవారం ఓ రెసిడెన్షియల్ కళాశాలలో చేరడానికి వెళ్లేందుకు అన్ని సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన పొలంలో ఉన్న జేసీబీ నీటిగుంతలో స్నానం చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటంబ సభ్యులు అక్కడ వెళ్లి చూడగా ప్రక్కనే బట్టలు విప్పి ఉండడంతో అందులో దిగి చూశారు. జేసీబీ గుంతలో అతను మృతి చెంది ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు మృతదేహాన్ని బయటికి తీసి బోరున విలపించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ప్రసాద్ (ఫైల్)

దుబ్బాక: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పట్టణానికి చెందిన ఆలేటి ప్రసాద్ (38) వంట పనిచేస్తూ భార్య స్వాతి, కొడుకు శ్రీకరణ్‌తో జీవనం సాగిస్తున్నాడు. పని మీద వెళ్తున్న అతను పెద్ద గుండవెళ్లి నుంచి దుంపలపల్లి చేరుకోగానే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతణ్ని కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోదకు అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

చేనేత వృత్తి లేక వంట పనిచేస్తూ..

మృతుడు చేనేత కుటుంబానికి చెందిన వాడు. వృత్తిలో ఉపాధిలేకపోవడంతో వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని స్థానికులు వాపోయారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని నీలకంఠ సంఘం అధ్యక్షుడు సత్యానందం, కార్యదర్శి అంబుదాస్, తదితరులు కోరారు.

గుండెపోటుతో వ్యక్తి..



మంక్యానాయక్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..హరితహారంలో పనిచేస్తున్న మంక్యానాయక్(45), రోజు మాదిరిగానే రోడ్లకు ఇరువైపుల హరితాహారం మొక్కలకు ట్యాంకర్ సహాయంతో నీళ్లు పోసేవాడు. ఈ క్రమంలో మంక్యానాయక్ మంగళవారం కూడా హరితహారం మొక్కలకు నీరు పెడు తుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చి క్రింద పడ్డాడు. దీన్ని గమనిచిన స్థానికులు అతణ్ని రామవరంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నలుగురు మృతి

ఆర్థిక ఇబ్బందులు తాళలేక నలుగురు మృతి చెందారు.

మద్దూరు(హుస్నాబాద్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపం చెంది రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఇజ్జగిరి శేఖర్(33) తనకు ఉన్న 6ఎకారల భూమిలో వరిపొలం సాగు చేశాడు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బ తినడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో పాటు వ్యవసాయనికి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో మళ్లీ వ్యవసాయం చేసి అప్పులు తీర్చాలనుకున్నాడు. ఈ క్రమంలో పెట్టుబడికి ఎవరు కూడా అప్పు ఇవ్వక పోడంతో మనస్థాపానికి గురై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసున్నాడు. మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేదినిపూర్ గ్రామానికి చెందిన చక్రపాణి (60) ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారులోని అడవి దగ్గర చక్రపాణి చనిపోయినట్లు మంగళవారం కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం చేరవేశారు. వెంటనే భార్య మల్లవ్వతో పాటు మరికొందరు వెళ్లి చూడగా చక్రపాణి మృతదేహంగా గుర్తించారు. కొన్ని నెలలుగా అతను ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండేవాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..మోగుడంపల్లి మండలం, మన్నాపూర్ తొట్టి తండాకు చెందిన పరుశురాం (36) ఏడేళ్ల క్రితం అమీన్ పూర్ వలస వచ్చి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై అప్పులు చేశాడు. మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మద్యానికి బానిసై...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మద్యానికి బానిసై భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ప్రాంతానికి చెందిన హనుమంతప్ప (36) ఉపాధి నిమిత్తం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరుకు వలస వచ్చాడు. ఇక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై సోమవారం మద్యం తాగి ఉరివేసుకున్నాడు.